క్లుప్తంగా

శ్రీనివాసా... శ్రీవేంకటేశా



అమలాపురంలో వేంకటేశ్వరస్వామికి తొలి హారతి ఇస్తున్న అర్చకుడు

అమలాపురం టౌన్: శ్రీనివాసా... శ్రీవేంకటేశా.. అంటూ ఆ స్వామివారిని భక్తజనం కొలిచింది. కోనసీమ పెళ్లిళ్ల వెంకన్నగా పేరుగాంచిన అమలాపురం వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి శనివారం తెల్లవారు జామున తొలి హారతిని కళ్లారా వీక్షించి భక్తులు తరించారు. స్వామివారికి పలు అభిషేకాలు, హోమాలు, పూజలు జరిగాయి. దేవస్థానం ప్రధాన అర్చకుడు పెద్దింటి లక్ష్మీ నరసింహాచార్యులు ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామికి పూజలు నిర్వహించింది. శనివారం, కృష్ణాష్టమి పర్వదినం కావడంతో ఆలయం కిటకిటలాడింది. మధ్యాహ్నం దేవస్థానంలో నిర్వహించిన అన్నదానంలో కూడా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దేవస్థానం ఈఓ యర్రా వెంకటేశ్వరరావు, సిబ్బంది ఆధ్వర్యంలో భక్తులకు సేవలందించారు.

ఘనంగా డి-జ్యూర్ ట్రాన్స్‌ఫర్ డే

యానాం: 1956 మే 28న చేసుకున్న ట్రీటీ ఆఫ్ సెషన్ ఒప్పందానికి మే 1962లో ఫ్రెంచి పార్లమెంట్ ఆమోద ముద్ర వేసింది. ఈ నేపథ్యంలో యానాం తదితర స్థావరాల సార్వభౌమాధికారాలను 1962లో ఆగస్టు 16న ఫ్రెంచ్ ప్రభుత్వం భారత దేశానికి అప్పగిస్తూ బదలాయించిన రోజును పురస్కరించుకుని సమాచార శాఖ ఆధ్వర్యంలో డి-జ్యూర్ ట్రాన్స్‌ఫర్ డేను శనివారం నిర్వహించారు. స్థానిక గాంధీ పార్క్‌లో స్మారక చిహ్నం వద్ద ఆర్ఏఓ మునిస్వామి, ట్రైనీ ఐఏఎస్ అధికారి, మున్సిపల్ కమిషనర్ బుద్ధి అఖిల్, ఎస్పీ చింతా కోదండ రామ్ తదితరులు నివాళులర్పించారు.

భక్తిశ్రద్ధలతో క్షీరాధివాసం



సీతారామపురంలో విజయ కనకదుర్గాదేవి అమ్మవారికి క్షీరాధివాసం చేస్తున్న దృశ్యం

తాళ్లరేవు: శ్రీవిజయకనక దుర్గాదేవి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శనివారం విశేష పూజలు నిర్వహించారు. కోరంగి పంచాయతీ సీతారామపురం కోలాటివారి రేవు వద్ద ఆత్రేయ గోదావరి చెంతన నిర్మించిన ఆలయంలో గ్రామ పురోహితుడు కందికొండ భాస్కరశర్మ నేతృత్వంలో వేద పండితులు విఘ్నేశ్వర పూజ, మండప పునఃపూజలు, లక్ష్మీగణపతి సహిత నవగ్రహ హోమం, జలాధివాసం, క్షీరాధివాసం, వాస్తు హోమం, ప్రధాన దేవతా హోమాలను భక్తిశ్రద్ధలతో జరిపారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, మండల నాయకులు టి.లక్ష్మణరావు, బూరిబాబు, రామలక్ష్మి, చంటి, బాబి తదితరులు పూజల్లో పాల్గొన్నారు. ప్రతిష్ఠా మహోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం 7.16 గంటలకు శ్రీవిజయ కనకదుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు.

నేడు లక్ష్మీ గణపతి విగ్రహ ప్రతిష్ఠ

జి.వేమవరం రామాలయం వీధిలో కొత్తగా నిర్మించిన ఆలయంలో ఆదివారం ఉదయం లక్ష్మీగణపతి పరివార దేవతల విగ్రహ ప్రతిష్ఠ ఉంటుంది. శనివారం వేదపండితుడు సత్యనారాయణ శర్మ నేతృత్వంలో వాస్తుపూజ, ధాన్యాధివాసం, పుష్పాధివాసం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యార్థుల ప్రతిభ

యానాం: పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్యార్థులు సెంట్రలైజ్డ్ అడ్మిషన్ కమిటీ (సెంటాక్) శనివారం ప్రకటించిన మెరిట్ జాబితాలో ఎంబీబీఎస్, డెంటల్ సీట్లు సాధించారు. స్థానిక రీజెన్సీ జూనియర్ కళాశాల విద్యార్థులు మనోవెంకటేష్, జి.జెస్సీప్రియా, కె.భావ్యకీర్తి, జి.లక్ష్మీఅఖిల పుదుచ్చేరి ఇందిరాగాంధీ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీట్లు సాధించారు. అదేవిధంగా పుదుచ్చేరి ప్రభుత్వ డెంటల్ కళాశాలలో ఆర్.యుక్తముఖి, వెంకటేశ్వర మెడికల్ కళాశాలలో కె.భావ్యశ్రీ, ఎస్.జెస్సీకా, డి.దినేష్ ఎంబీబీఎస్ సీట్లు సాధించారని ప్రిన్సిపాల్ మార్తాండ ప్రసాద్ తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన వీరు సీట్లు సాధించడం గర్వకారణమన్నారు.

గౌతు లచ్చన్న దేశభక్తి ఆదర్శం



గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న మంత్రి సుభాష్ తదితరులు

అమలాపురం టౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న దేశభక్తి, ధైర్యసాహసాలు నేటితరానికి ఆదర్శమని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా స్థానిక శ్రీరామ్‌నగర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగిన సభలో మంత్రి సుభాష్ మాట్లాడారు. మాజీ కౌన్సిలర్ వాసంశెట్టి సత్యం, మాజీ సర్పంచ్ రాజులపూడి భీముడు పాల్గొన్నారు.



దేవగుప్తంలో శ్రీకృష్ణునికి తులసి మాలతో అలంకరణ



అమలాపురం వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఉట్టికొట్టే ఉత్సవం



సత్యసాయి బాలవికాస్ చిన్నారుల సందడి



చెయ్యేరులో గోపెమ్మల కోలాటం



పెదబొడ్డు వెంకటాయపాలెంలో సందడి

వెన్న దొంగ.. అల్లరి మురిపెంగ

- ఊరూవాడా కృష్ణాష్టమి వేడుకలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

అమలాపురం టౌన్: శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని ఊరూవాడా సందడి నెలకొంది. శనివారం ప్రతి ఇంటా తమ చిన్నారులను గోపికలు, చిన్న కృష్ణయ్యలుగా అలంకరించారు. అలాగే వివిధ సంస్థల ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకొన్నారు. అమలాపురం కూచిమంచి అగ్రహారంలోని సత్యసాయి బాలవికాస్ కేంద్రంలో కృష్ణాష్టమి వేడుకలు అలరించాయి. బాలవికాస్ విద్యార్థులు చిన్ని కృష్ణుడు, రాధ, సత్యభామ వేషధారణలో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. తొలుత శ్రీకృష్ణుడి చిత్రపటాలకు పూజలు చేసి, శ్రీకృష్ణ భగవానుడి చరిత్రను విద్యార్థులకు వివరించినట్లు అమలాపురం డివిజన్ శ్రీసత్యసాయి సేవా సంస్థల కోఆర్డినేటర్ డాక్టర్ జి.ప్రభాకర్ చెప్పారు. చివరగా ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలవికాస్ విద్యార్థులు ఉట్టి కొట్టేందుకు పోటీ పడిన తీరు భక్తులను ఆకట్టుకుంది. బాలవికాస్ ప్రతినిధులు భవాని, నీలమలు చిన్నారులచే శ్రీకృష్ణతత్వ పద్యాలను చదివించారు. స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి ఆర్థిక సాయంతో, పిరమిడ్ స్పిచువల్ సొసైటీ ఆధ్వర్యంలో దేవస్థానం వద్ద కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. చిన్నారుల నృత్య కార్యక్రమం ఆకట్టుకుంది. వైఎస్సార్ సీపీ పట్టణ యువజన అధ్యక్షుడు దూడల ఫణి, ఉమ్మడి జిల్లా ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం అధ్యక్షురాలు యెండూరి సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

కాట్రేనికోన: చెయ్యేరులో బాలు యాదవ్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు జరుపుకొన్నారు. శ్రీకృష్ణుడు, గోపికలు వేసధారణతో చిన్నారులు పాటలు పాడుతూ ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుని పాటలతో కోలాటం ఆడారు. అనంతరం రక్తదాన శిబిరం జరిగింది. మండలంలో గొల్లల వీధి, కుండలేశ్వరం, పల్లంకుర్రు, మొక్కలతిప్ప, గచ్చకాయలపోర ఎంజీఆర్ కాలనీ, బలుసుతిప్ప తదితర గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి.

అమలాపురం టౌన్: పట్టణంలో పలుచోట్ల శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. స్థానిక గొల్లగూడెం బైపాస్ రోడ్డులోని శ్రీకృష్ణాలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ రథోత్సవం పురవీధుల్లో వైభవంగా సాగింది. ఈ సందర్భంగా జరిగిన ఊరేగింపులో శక్తివేషాలు, తీన్‌మార్ డప్పు వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆలయం వద్ద రాత్రి 8 గంటలకు ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పోటీ పడ్డారు. అమలాపురం వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో సాయంత్రం ఉట్టికొట్టే ఉత్సవం జరిగింది. చిన్నారులు ఉట్టి కొట్టేందుకు ఎగబడ్డారు. స్థానిక 30వ వార్డు రావులచెరువు ప్రాంతంలో రామాలయం, శ్రీకృష్ణ మందిరం వద్ద శ్రీరామ సేవా సమితిచే శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. చిన్నారులకు రాధా, కృష్ణుల వేషధారణలో అలరించారు. ఆధ్యాత్మిక వేత్త రేలంగి కుమార్ శంకర్ గౌడ్ శ్రీకృష్ణ తత్వంపై ప్రవచనాలు చేశారు. పోటీల్లోని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజమహేంద్రవరం ఇస్కాన్ కేంద్రం అమలాపురం అవుట్ పోస్టు మేనేజర్ నిమయి శివానందదాస్, గొవ్వాల నాగరాజు, సలాది సాయిరామ్ పాల్గొన్నారు. శ్రీరామ సేవా సమతి అధ్యక్షుడు గొవ్వాల అచ్యుతరామయ్య ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. బోడసుకుర్రు టిడ్కో ఇళ్ల సముదాయంలో పట్టణానికి చెందిన ప్లాట్‌దారులు శ్రీకృష్ణాష్టమి వేడుకలను వైభవంగా జరుపుకున్నారు.

అల్లవరం: బెండమూర్లంకలో కృష్ణాష్టమి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కృష్ణుని జన్మదిన వేడుకలు నిర్వహించారు. నామన చిన్నికృష్ణ, కళ్యాణి దంపతులచే స్వామివారికి పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద శ్రీకృష్ణ నామ సంకీర్తన జరిపారు. గుర్రం రామకృష్ణ, గుర్రం దొరబాబు, గిడుగు భాస్కరరావు, కసిరెడ్డి పుల్లాజీ పాల్గొన్నారు. దేవగుప్తంలో శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. సర్పంచ్ సాధనాల వెంకటరావు, ఎంపీటీసీ ముత్తాబత్తుల రాంబాబు, పెద్దలు గుబ్బల నాగేశ్వరరావు, నూని ప్రసాదు, కుడుపూడి సూర్యప్రకాశరావు పాల్గొన్నారు. ఓడలరేవులోనూ శ్రీకృష్ణునికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

అలరించి.. ఆకట్టుకుని..

ఉప్పలగుప్తం /యానాం/ తాళ్లరేవు: గొల్లవిల్లిలో బాలికలు కోలాట నృత్యాలతో సందడి చేశారు. ఉప్పలగుప్తం, ఎస్.కొత్తపల్లి, మునిపల్లి, భీమనపల్లి, చల్లపల్లి, గ్రామాల్లో ఉట్టి ఉత్సవం నిర్వహించారు. యానాం ఓల్డేజ్ హోమ్‌లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. చిన్నారులు చిన్ని కృష్ణుని వేషధారణతో అలరించారు. తాళ్లరేవు, కోరంగి, చొల్లంగి, చొల్లంగిపేట, జార్జిపేట తదితర గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.



యానాం ఓల్డేజ్ హోమ్‌లో కృష్ణాష్టమి వేడుకలు



అమలాపురం రావులచెరువులో రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు



గొల్లగూడెం శ్రీకృష్ణాలయంలో శ్రీకృష్ణ మూలవిరాట్

అమలు కాని హామీలతో మోసం



కందికుప్పలో బ్రోచర్లు ప్రదర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కాట్రేనికోన: ఎన్నికల ముందు అమలుకాని హామీలను ఇచ్చి అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడు ప్రజలను మోసం చేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు నేల కిశోర్ అన్నారు. కందికుప్పలో సర్పంచ్ వెంకటలక్ష్మి అధ్యక్షతన శనివారం వైఎస్సార్ సీపీ చేపట్టిన 'బాబు షూరిటీ- మోసం గ్యారంటీ' కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. మండల పార్టీ అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి మాట్లాడుతూ అర్హత ఉన్నా లబ్ధిదారులను సంక్షేమ పథకాల నుంచి తొలగిస్తున్నారన్నారు. ఇంటింటికీ వెళ్లి క్యూఆర్ కోడ్‌తో ఉన్న బ్రోచర్లను అందజేసి చంద్రబాబు మోసాలను వివరించారు. అనంతరం ఏడిది లక్ష్మణరావు అధ్యక్షుడిగా పార్టీ నూతన గ్రామ కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. కార్యక్రమంలో కోలాటి సత్యం, చల్లగల అప్పారావు, గెద్దాడ గుణవేణుకుమార్, కె.రమణ, వరసాల చిన్నారావు, మేకల బ్రహ్మం, నందిక ధనరాజు, కాశి భరత్ తదితరులు ఉన్నారు.

సూపర్ సిక్స్ హామీల అమలెక్కడా!



ఇందుపల్లిలో బాబు షూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

అమలాపురం రూరల్: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్ గోపాల్ విమర్శించారు. అమలాపురం మండలం ఇందుపల్లి, సాకుర్రు, గున్నేపల్లి అగ్రహారం గ్రామాల్లో 'బాబు షూరిటీ- మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు కావొస్తున్నా ఏ ఒక్క పథకం సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను 'బాబు షూరిటీ- మోసం గ్యారంటీ' కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరిస్తున్నామని అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు గుత్తుల చిరంజీవిరావు, పోలమూరి బాలకృష్ణ, మాజీ జెడ్పీటీసీ కుడుపూడి వెంకటేశ్వరబాబు, పార్టీ జిల్లా అధికారి ప్రతినిధి సుధా గణపతి, సరేళ్ల రామకృష్ణ, చొల్లంగి సుబ్బిరామ్, వాసంశెట్టి శ్రీను, కేతా భానుతేజ, కుడుపూడి ప్రసాద్, బొక్కా నరసింహమూర్తి, నాగాబత్తుల కొండబాబు, మాజీ సర్పంచ్ ములపర్తి సత్యనారాయణ, కుడుపూడి రామకృష్ణ, చొల్లంగి బాలరాజు, దొమ్మేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

గుట్కా విక్రేత అరెస్ట్

యానాం: నియోజకవర్గ పరిధిలో అయ్యన్ననగర్‌లో ఒక కిరాణా దుకాంలో నిషేధిత గుట్కా, ఖైనీ ప్యాకెట్లను విక్రయిస్తున్న వ్యక్తిని శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్సైలు పునీత్‌రాజ్, శేరు నూకరాజు తెలిపారు. అయ్యన్ననగర్‌లో కిరాణా దుకాణంలో గుట్కా, ఖైనీ ప్యాకెట్లు అమ్మకాలు సాగిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆ షాపుపై దాడి చేశామన్నారు. ఈ సందర్భంగా సుమారు రూ.7 వేల విలువైన సరకు స్వాధీనం చేసుకుని షాపు యజమాని చింతలపూడి నూకరాజును అరెస్ట్ చేశామన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

తాళ్లరేవు: జార్జిపేట గ్రామ పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం అవుతున్నాయని, దీనిపై డీఎల్‌పీఓ విచారణ చేపట్టాలని ఉప సర్పంచ్ పేర్ని ఆదినారాయణ మూర్తి, పలువురు వార్డు సభ్యులు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. స్థానిక కడలివారి వీధిలో నిర్మించిన సీసీ డ్రైన్‌పై బల్లలు వేయకపోవడంతో చిన్నారులు ప్రమాదాల బారిన పడుతున్నారని, బల్లలు వేయాలని పంచాయతీ కార్యదర్శిని కోరగా ఆ పనికి సంబంధించిన బిల్లులు కాకుండా పూర్తి చేయలేమని చెప్పారన్నారు. స్థానిక నందిబొమ్మ కాలనీలో సీసీ రోడ్లు వేసి బెర్ములు వేయలేదన్నారు. పాలకవర్గ సభ్యులు తీర్మానం లేకుండా, రికార్డుల్లో నిబంధనలకు విరుద్ధంగా పొందుపరచి, శ్రీరామ్‌కాలనీలో సీసీ డ్రైన్ నిర్మించారన్నారు. ఆగస్టు 2023 నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు పక్కదోవపడుతున్నాయని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ నిర్వహించాలని వార్డు సభ్యులు శీలి రాజు, గుత్తుల నూకరాజు, పెట్ల శాంతకుమారి, గోవిందు, చినబాబు, సత్యనారాయణ తదితరులు డిమాండ్ చేశారు.

గౌరవ వేతనాలు అందించండి



వంగా గిరిజా కుమారి

ఉప్పలగుప్తం: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లకు గౌరవ వేతనాలు అందించడం లేదని సన్నవిల్లి, నంగవరం ఎంపీటీసీ సభ్యురాలు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు వంగా గిరిజాకుమారి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు ప్రజా ప్రతినిధులకు సకాలంలో వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు.

క్రీడాకారిణులకు ప్రోత్సాహకాలు



క్రీడాకారిణులకు నగదు అందజేస్తున్న బూరెల వెంకట్రాజు

తాళ్లరేవు: చొల్లంగి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు క్రీడాకారిణులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచడంతో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు బూరెల వెంకట్రాజు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ప్రోత్సాహకాలు అందజేసినట్లు స్కూల్ పీడీ నీలిమ తెలిపారు. గత విద్యా సంవత్సరంలో జాతీయ స్థాయి సాఫ్ట్ టెన్నిస్‌లో ప్రతిభ చాటిన పుష్పలత, బేస్‌బాల్‌లో ప్రతిభ కనబరిచిన జాహ్నవి లావణ్యలకు వెంకట్రాజు నగదు అందజేశారు. వెంకట్రాజు మాట్లాడుతూ విద్యార్థినులు చదువుతోపాటు క్రీడల్లో రాణించడం అభినందనీయమన్నారు.

దళితులపై దాడులకు వ్యతిరేకంగా పోరాటం

అమలాపురం టౌన్: దళితులపై జరుగుతున్న దాడులు, ప్రజా సమస్యలపై భారత రిపబ్లికన్ పార్టీ నిరంతర పోరాటాలు చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎం రుషి అన్నారు. స్థానిక సావరం రోడ్డులో రుషి అధ్యక్షతన శనివారం పార్టీ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు సక్రమంగా లేవన్నారు. జిల్లాలో పార్టీని గ్రామ గ్రామాన మరింత విస్తరించేందుకు సమావేశం చర్చించింది. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా రుషి మరోసారి ఎన్నికయ్యారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బల్ల సత్యనారాయణ, గిడ్డి జ్ఞానప్రకాష్, ప్రత్తిపాటి సుధాకరరావు, ఎలిపే సోమరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా కట్టా వేణుగోపాలకృష్ణ, దడాల రామకృష్ణ, మాదే బాల సత్యనారాయణ, గెద్దాడ సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శులుగా బడుగు సత్యనారాయణ, మోకా బాలయోగి, కోశాధికారిగా చీకురుమిల్లి చిరంజీవి ఎన్నికయ్యారు. సమావేశంలో నాయకులు ఉచ్చుల సాల్మన్‌రాజు, పంతగంటి నరసింహమూర్తి, చీకురుమిల్లి శ్రీనివాస్, తరపట్ల వెంకటేశ్వరరావు, మోకా కృష్ణమూర్తి, కలకట రమణ, గిడ్డి ప్రసాద్, జనుపల్లి చిన్న తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవ చేయాలి

అమలాపురం టౌన్: జిల్లాలోని పాస్టర్లు సమాజ సేవ చేయాలని జిల్లా యునైటెడ్ పాస్టర్ ఫెల్‌షిప్ అధ్యక్షుడు కార్ల్ డేవిడ్ కొమనాపల్లి (లాల్) పిలుపునిచ్చారు. స్థానిక వడ్డిగూడెంలోని మన్నా జూబ్లీ చర్చిలో రూరల్ మండల కమిటీ ఎన్నిక సందర్భంగా శనివారం పాస్టర్ల సమావేశం జరిగింది. పాస్టర్ కె.భాస్కరరావు ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ సమావేశానికి మండల ఫెల్ షిప్ అధ్యక్షుడు ఎస్.నోబెల్ రాయ్ అధ్యక్షత వహించారు. జిల్లా ఫెల్‌షిప్ కార్యదర్శి పాస్టర్ యెహోషువ ప్రార్థనలు చేశారు. అనంతరం మండల ఫెలోషిప్ కమిటీ అధ్యక్షునిగా నోబెల్ రాయ్, ఉపాధ్యక్షునిగా ఆనందరావు, కార్యదర్శిగా డేనియల్, సంయుక్త కార్యదర్శిగా శామ్యూల్, కోశాధికారిగా జోషఫ్, సంయుక్త కోశాధికారిగా ప్రసాద్‌ఎంపికయ్యారు.

దళిత ఎమ్మెల్సీ అంటే అంత చిన్నచూపా?



భీమనపల్లిలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ దళిత నాయకులు

ఉప్పలగుప్తం: జనసేన నాయకులు ఈ మధ్య కాలంలో దళిత ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌పై సోషల్ మీడియా వ్యాప్తంగా విపరీతమైన వ్యాఖ్యలు చేస్తున్నారని, దళిత ఎమ్మెల్సీ అంటే అంత చిన్నచూపా అంటూ పలువురు దళిత నాయకులు మండిపడ్డారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌పై ఇటీవల కాలంలో సోషల్ మీడియా వ్యాప్తంగా కొంతమంది జనసేన నాయకులు చేస్తున్న దిగజారుడు మాటలకు ఖండనగా అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ దళిత నాయకులంతా భీమనపల్లిలో సమావేశమై స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికార పార్టీ చేస్తున్న తప్పులను ప్రతిపక్షం ప్రశ్నిస్తుందన్నారు. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ఇటీవల కాలంలో 'బాబు షూరిటీ- మోసం గ్యారంటీ' సమావేశంలో మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ పార్టీ పెట్టి టీడీపీకి పాలేరుతనం చేస్తున్నారని మాట్లాడటంలో తప్పేముందన్నారు. సీఎం అవుతాను, ప్రశ్నిస్తాను, పోరాతానని పార్టీ పెట్టిన పవన్‌కళ్యాణ్ ప్రస్తుతం టీడీపీలో 15 సంవత్సరాలు సావాసం చేయాలని ఆ పార్టీ కార్యకర్తలకు సందేశం ఇస్తున్న తీరుపైనే ఎమ్మెల్సీ విమర్శించారన్నారు. వాస్తవాలను మాట్లాడిన ఎమ్మెల్సీపై వ్యక్తిగత విమర్శలు చేయడం తగదన్నారు. దళిత సామాజిక వర్గంలో పి.గన్నవరం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన గిడ్డి సత్యనారాయణ ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు ఫోన్ చేసి బెదిరిస్తూ దానిని వీడియో తీసి సామాజిక మాధ్యమాలలో ప్రచారం చేయడం ఆయన దిగజారుడు రాజకీయాన్ని చూపిస్తుందన్నారు. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ వెంట వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, దళిత ప్రజలు ఉన్నామని, ఆయనపై వ్యక్తిగత విమర్శలు చేస్తే ప్రతి ఒక్కరి వ్యక్తిగత విషయాలు బయట పెడతామన్నారు. సర్పంచులు కడిమి చిన్నవరాజు, పెయ్యల రాజ్‌కుమార్, యర్రంశెట్టి రామచంద్రరావు, దాకారపు చిరంజీవి, ఎంపీటీసీ సభ్యులు పెటా అప్పారావు, కొంకి ఏడుకొండలు, టౌన్ ఉపాధ్యక్షుడు పాలమూరి ప్రవీణ్, మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజు, పార్టీ నాయకులు సరెళ్ల రామకృష్ణ, కుంచే స్వామి, నక్కా సంపత్, సాధనాల శ్రీను, కాట్రు కృష్ణ, ఎస్ఎస్ కుమార్, బడుగు గణేష్, నేరుడుమిలి శ్రీను, గంటా లక్ష్మీప్రసాద్, పుత్రేపు చందు, పాలమాటి రామకృష్ణ, విక్రమ్, పరమట రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పడవ మరమ్మతులకు సాయం



పడవ మరమ్మతుల నిమిత్తం గ్రామ పెద్దలకు సాయం చేస్తున్న రమణారావు

అమలాపురం టౌన్: పి.గన్నవరం మండలం ఊడిమూడి గ్రామంలో గోదావరి పాయపై ప్రయాణికులను దాటించే పడవ ఇటీవల మరమ్మతులకు గురైంది. ఈ విషయాన్ని పలువురు గుడ్‌సీడ్ ఫౌండేషన్ దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై స్పందించిన ఫౌండేషన్ ఫౌండర్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు కుంచే వెంకట రమణారావు ఆ పడవ మరమ్మతుల కోసం ఆ గ్రామ పెద్దలకు రూ.30 వేలు అందించారు. స్థానిక గుడ్ సీడ్ ఫౌండేషన్ కార్యాలయంలో ఊడిమూడి గ్రామస్తులకు ఈ సాయాన్ని శనివారం అందజేశారు. భీమనపల్లి సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి గొలకోటి సూర్యప్రకాష్, ఊడిమూడి గ్రామ పెద్దలు బండి శ్రీను, అయినపర్తి సత్యనారాయణ, గూటం మహేష్, యల్లమిల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



గోవిందరాజులు (ఫైల్)

ముమ్మిడివరం: క్రవ్వానిరేవు గ్రామానికి చెందిన అద్దంకి గోవిందరాజులు (30) అదృశ్యమయ్యాడు. వెల్డింగ్ పనిచేస్తున్న అతను గురువారం భార్యతో తన స్నేహితుడు డబ్బులు ఇస్తాడని చెప్పి బైక్‌పై వెళ్లి ఎంత సేపటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు గాలింపు చర్యలు చేపట్టారు. అన్నంపల్లి కొత్త అక్విడెట్‌పై గోవిందరాజులు దుస్తులు, చెప్పులు, బైక్ ఉన్నట్లు గుర్తించారు. పక్కనే యాసిడ్ బాటిల్ ఉంది. మొబైల్ ఫోన్ కనిపించలేదు. అతను గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడనే అనుమానంతో కుటుంబ సభ్యులు ముమ్మిడివరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై డి.జ్వాలాసాగర్ ఆధ్వర్యంలో గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టారు. గోవిందరాజులకు వివాహమై భార్య ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు.

పీహెచ్‌సీ పరిధిలో ఆశ వర్కర్ల నియామకం

ఉప్పలగుప్తం: మండలంలోని ఉప్పలగుప్తం పీహెచ్‌సీ పరిధిలో ఆశ వర్కర్లను నియమించినట్టు వైద్యాధికారి ఎల్.నాగార్జున ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పీహెచ్‌సీలో కొంతకాలంగా ఖాళీగా ఉన్న గొల్లవిల్లి, ఉప్పలగుప్తం ఆశ వర్కర్ల పోస్టులకు బత్తుల భాగ్యలక్ష్మి, కాశిన శివగౌరీలను డిస్ట్రిక్ సెలక్షన్ కమిటీ సహకారంతో ఎంపిక చేసి, ఉత్తర్వులు జారీ చేశామన్నారు.

వ్యాపారాలు నష్టపోతున్నాం



యానాం ఎస్పీ కోదండరామ్‌తో సమావేశమైన వర్తకులు

యానాం: పోలీసులు యానాం పట్టణంలో ప్రవేశించే వాహనాలపై కేసులు నమోదు చేస్తుండటంతో సరిహద్దు ఆంధ్రా ప్రాంతం నుంచి ఎవరూ పట్టణంలోకి రాని పరిస్థితి నెలకొందని, దీంతో తాము వ్యాపారాలను నష్టపోతున్నట్లు పలువురు వ్యాపారులు శనివారం ఎస్పీ చింతా కోదండరామ్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి శనివారం స్టేషన్‌లో నిర్వహించే మక్కల్ మంద్రం కార్యక్రమంలో వర్తకులు పాల్గొన్నారు. పట్టణంలో వ్యాపారాలు సాగాలంటే ఆంధ్రా ప్రాంతం నుంచి వచ్చే వర్తకులే తమకు ప్రధాన ఆధారమని, యానాంలో ప్రవేశించే వివిధ వాహనదారులపై ట్రాఫిక్ పేర కేసులు నమోదు చేస్తున్నారని, దీంతో వారు భయపడి పట్టణంలోకి రావడం లేదన్నారు. ఇప్పటికే పలు వ్యాపార సంస్థలు యానాం బైపాస్ రహదారికి వెళ్లిపోయాయని, విద్యుత్ చార్జీలు, షాపుల అద్దెలు భారంగా మారాయని, దీనికి తోడు పోలీసులు కేసులు ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఎస్పీని వారు కోరారు. సమావేశంలో వర్తక సంఘం గౌరవ అధ్యక్షుడు మాజేటి సత్యభాస్కర్, కాపగంటి గోపాలకృష్ణ, కాపగంటి తాజుద్దీన్, వేగేశ్న రాజు, సూరిబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.